

ఎక్సైజ్ ఎస్ఐపై బదిలీ వేటు!

రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు

వికారాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : విధి నిర్వహణలో దుష్ప్రవర్తనతో వ్యవహరించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ పీఅండ్ఈఎస్ఐ బి.కోటేశ్వర్‌రావును రంగారెడ్డి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. వికారాబాద్ సమీపంలోని గోధుమగూడలోని ఓ రిసార్ట్స్‌కు కోటేశ్వర్‌రావు తనిఖీల పేరిట వెళ్లారు. ఆ సమయంలో అక్కడ గెస్ట్‌రూముల్లో హైదరాబాద్ నుంచి కొందరు ఉన్నారు. గెస్ట్ రూముల్లోకి వెళ్లి అక్కడ ఉన్న వారి పట్ల కోటేశ్వర్‌రావు తనిఖీల పేరిట దురుసుగా, దుష్ప్రవర్తనతో వ్యవహరించారంటూ ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లింది. ప్రాథమిక విచారణ నిర్వహించిన ఉన్నతాధికారులు కోటేశ్వర్‌రావును రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఈ.శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. జరిగిన సంఘటనపై విచారణ నిర్వహించి తనకు నివేదిక అందజేయాలని ఆయనను కమిషనర్ ఆదేశించారు.

కమ్మేసిన మంచుదుప్పటి



ఘట్‌కేసర్‌ను మంగవారం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం భారీగా పొగమంచుతో చుట్టేసింది. సమీపంలో ఉన్న వారు కనిపించని పరిస్థితి నెలకొంది. వాహనదారులు హెడ్‌లైట్ల వెలుతురులోనే రాకపోకలు సాగించారు. ఉదయం 10గంటలకు మంచు తీవ్రత తగ్గడంతో భానుడు దర్శనమిచ్చాడు.

- ఘట్‌కేసర్, జనవరి 30

రోడ్డెక్కిన రైలు..

లారీపై రైలు పరుగెడుతుందని అనుకుంటున్నారా... లేక రైలు ఇంజన్ రోడ్కెక్కడమేంటని అనుకుంటున్నారా.. అదేనండి... మేడ్చల్ పట్టణంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై ఓ పెద్ద లారీ ఎంఎంటీఎస్ రైలు ఇంజన్‌ను తీసుకుని నగరం వైపు వెళ్తున్న క్రమంలో మేడ్చల్ మండలం ఎల్లంపేట గ్రామ సమీపంలో ఆగింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు, చుట్టు పక్కల వారు లారీపై రైలు ఇంజన్‌ను చూసి సెల్ఫీలు దిగారు.

- మేడ్చల్‌టౌన్, జనవరి 30



లారీలో తరలుతున్న ఎంఎంటీఎస్ రైలు ఇంజన్ బోగి



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

కొడంగల్, జనవరి 30: వచ్చేనెల 5న సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారని, ఇందుకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను వికారబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఎస్పీ కోటిరెడ్డి, నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్‌లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, మయాంక్ మిట్టల్, సీఎం సోదరుడు తిరుపతిరెడ్డితో కలిసి నియోజకవర్గంలో చేపట్టబోయే వివిధ కార్యక్రమాలపై చర్చించారు. కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన దర్శనం, హెలీప్యాడ్, పార్కింగ్, రాఘవేంద్రగార్డెన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కోస్గి పట్టణంలో హెలీప్యాడ్ ప్రాంతాన్ని ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు, డీఆర్‌డీవో పీడీ కృష్ణన్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



నివేదికను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

నేవీరాడార్ ఏర్పాటును పరిశీలించాలి

- పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

పూడూరు, జనవరి30 : దామగుండంలో నేవీరాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం పునర్‌పరిశీలించాలని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మన్నెగూడ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 2009లో రాష్ట్రం, కేంద్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే ఇక్కడ నేవీరాడర్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపిందని, తెలంగాణ ప్రభుత్వం ఇక్కడి ప్రజలు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వృక్ష సందప, అందులో నివసించే 157 వివిధ పక్షి జాతులను, వివిధ రకాల జంతువులు నశిస్తాయనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం నేవీరాడార్ అడ్డుకుందని అన్నారు. ఇక్కడ కాకుండా దేశంలో ఎక్కడైనా మారుమూల ప్రాంతాల్లో నేవీరాడర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయొచ్చని, దేశ రక్షణకు తాము కూడా సానుకూలమేనన్నారు. కానీ ఇంతటి విధ్వంసానికి గురిచేసే రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడం సరైన పద్ధని అన్నారు. కావున రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నేవీరాడర్ స్టేషన్‌ను ఇక్కడ కాకుండా ఇతర ప్రాంతాల్లో స్థల పరిశీలన చేసి ఏర్పాటు చేయాలని అన్నారు. ఒకవేళ ఇక్కడే నేవీరాడర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే ఇక్కడ ప్రజలంతా తిరగబడతారని హెచ్చరించారు. రాడర్ స్టేషన్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ వల్ల మానవాళికి కూడా నష్టం కలుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తన సౌలభ్యం కోసం ఇదంతా చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మల్లేశం, ఉద్యమ నాయకులు దేవనోనిగూడెం వెంకటయ్య, రామన్న మాదిగ, అజారుద్దీన్, దయానంద్ గౌడ్, రాజేందర్, సదానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ అప్పగించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా కొందరు మిల్లర్లు బేఖాతరు చేస్తున్నారు. గడువులోగా సీఎంఆర్ అప్పగించని మిల్లుల యజమానులపై చర్యలకు సర్కారు సిద్ధమవుతోంది. అవసరమైతే జరిమానా విధించడంతో పాటు ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం మిల్లర్ల ఆస్తులు జప్తు చేయడానికి అడుగులు వేస్తోంది. సీఎంఆర్ లక్ష్యం చేరుకునేందుకు ఒకరోజు మాత్రమే గడువు ఉండగా, 23021.364 మెట్రిక్ టన్నుల బియ్యం రైస్ మిల్లర్లు అప్పగించాల్సి ఉంది. గడువులోగా జిల్లాలో ఎంతమేర సీఎంఆర్ రాబట్టుకోగలుగుతారనేది బుధవారం స్పష్టత రానుంది.

గత వానాకాలానికి సంబంధించి ఇప్పటికీ ఇచ్చింది 64 శాతమే

- యాసంగి సీజన్ ధాన్యానికి ఇంతవరకు వచ్చింది 9 శాతమే
- రెండు మిల్లులూ జీరో సీఎంఆర్
- 5 శాతం ఇచ్చిన రెండు మిల్లులు
- సగం మిల్లులూ 50 శాతం లోపే..
- గడువులోగా లక్ష్యం చేరేది కష్టసాధ్యమే ?

పరిగి మండలం, గడిసింగాపూర్‌లోని గణేష్ ఇండస్ట్రీస్



ఒక్కరోజే గడువు.. వచ్చింది సగమే!

లక్ష్యం చేరని సీఎంఆర్

వికారాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నిర్దేశించిన గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వని మిల్లుల యజమానులపై చర్యలు తీసుకునేందుకు పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. 2022-23యాసంగి, వానాకాలం సీజన్లలో అప్పగించిన ధాన్యానికి సంబంధించిన బియ్యం ఇచ్చేందుకు గత నెలలో గడువు ముగియగా, ప్రభుత్వ అభ్యర్థన మేరకు చివరి అవకాశంగా ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించారు. సీఎంఆర్ లక్ష్యం చేరుకునేందుకు ఒకరోజు మాత్రమే గడువు ఉండగా, 23021.364 మెట్రిక్ టన్నుల బియ్యం రైస్ మిల్లర్లు అప్పగించాల్సి ఉంది. ఒకరోజులో ఈ లక్ష్యంలో ఏ మేర చేరుకోగలుగుతారనేది ప్రశ్నార్థకంగా మారింది. కేటాయించిన ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ అప్పగించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా కొందరు మిల్లర్లు బేఖాతరు చేస్తూ వచ్చిన విషయం తెలిసిందే. గడువులోగా సీఎంఆర్ అప్పగించని మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. కేటాయించిన ధాన్యానికి అనుగుణంగా ఇవ్వాల్సిన సీఎంఆర్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రైస్ మిల్లులపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

సగం మిల్లులూ సగం లోపే..

గత ఏడాది(2022-23) వానాకాలం, యాసంగి సీజన్లలో అన్ని మిల్లుల నుంచి పకడ్బందీగా బియ్యం సేకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. గత వానాకాలంసీజన్‌లో జిల్లాలో 64 రైస్ మిల్లులకు 95095.560 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, సీఎంఆర్ రూపంలో 63714.025 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 40692.661 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం మాత్రమే మిల్లర్లు ఇచ్చారు. ఇంకా 23021.364 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఇవ్వాల్సిన సీఎంఆర్ లక్ష్యంలో మిల్లర్లు ఇప్పటి వరకు 64 శాతం మాత్రమే సీఎంఆర్ ఇచ్చారు. 64 మిల్లుల్లో ఇప్పటి వరకు 100 నుంచి 90 శాతం వరకు కేవలం 18 రైస్ మిల్లులు మాత్రమే సీఎంఆర్ అప్పగించాయి. జిల్లాలో 40 శాతంపైగా మిల్లర్లు 50 శాతంలోపే సీఎంఆర్ అప్పగించారంటే దాని వెనక ఉన్న మతలబు ఏమిటనేది స్పష్టమవుతోంది. ఇదిలా ఉంటే, గత రబీ సీజన్‌లో రైస్ మిల్లులకు 85225.600 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, సీఎంఆర్ రూపంలో 57953.408 మెట్రిక్ టన్నులు అప్పగించాల్సి ఉంది. కాగా, ఇంత వరకు జిల్లాలో కేవలం 4698 మెట్రిక్ టన్నులు మాత్రమే సీఎంఆర్ అప్పగించారు. నిర్దేశించిన లక్ష్యంలో ఇప్పటి వరకు 8 శాతం మాత్రమే సీఎంఆర్ ఇచ్చారు.



రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, పౌర సరఫరాల శాఖ అధికారులు (ఫైల్)

కిలో సీఎంఆర్ ఇవ్వని వైనం

జిల్లాలోని పరిగి మండలం, గడిసింగాపూర్‌లోని గణేష్ ఇండస్ట్రీస్, కొడంగల్‌లోని గురు రాఘవేంద్ర ఇండస్ట్రీస్ ఇంతవరకూ కిలో సీఎంఆర్ కూడా ఇవ్వలేవు. గణేష్ ఇండస్ట్రీస్‌కు గత వానాకాలం సీజన్‌లో 8833.20 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, 5918.24 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది, అదే గురు రాఘవేంద్ర ఇండస్ట్రీస్‌కు 11802.40 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా, 7907.60 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉండగా, ఈ మిల్లర్లు ఇంత వరకు కిలో సీఎంఆర్ కూడా ఇవ్వలేవు. జోగులాంబ ట్రేడర్స్‌కు 15928 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా, సీఎంఆర్ రూపంలో 10671.76 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది. కాగా, ఇంత వరకు 578.4మెట్రిక్ టన్నులు మాత్రమే సీఎంఆర్ ఇవ్వగా, ఇంకా 10093.36 మెట్రిక్ టన్నులు బకాయి పడ్డారు. బురాన్‌పూర్‌లోని కేతకి సంగమేశ్వర ఇండస్ట్రీస్‌కు 15692.80 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా, 10514.17 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 577.55 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. ఇంకా 9936.63 మెట్రిక్ టన్నులు బకాయి పడ్డారు.

ప్రభుత్వ ధాన్యంతో అక్రమ వ్యాపారం

జిల్లాలో పలువురు మిల్లర్లు ప్రభుత్వ ధాన్యంతో అక్రమ వ్యాపారం చేస్తూ కోట్లు కొల్లగొట్టారనేది జగమెరిగిన సత్యం. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా.. తెలియనట్లు వ్యవహరించారనే ఆరోపణలూ ఉన్నాయి. జిల్లాలో గత మూడు, నాలుగు సీజన్లుగా ప్రభుత్వానికి సీఎఆర్ సక్రమంగా అప్పగించకుండా ధాన్యం, సీఎంఆర్ బియ్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకుని పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకున్నారనేది అందరికీ తెలిసిందే. ప్రభుత్వం కేటాయించే ధాన్యాన్ని మిల్లింగ్ చేసి నిర్దేశించిన గడువులోగా మిల్లర్లు చెల్లించాల్సి ఉండగా, మిల్లర్లు కొందరు నిర్లక్ష్యంగావ్యవహరిస్తున్నారు. నాలుగైదు సీజన్లుగా సీఎంఆర్ ఆలస్యంగా ఇచ్చే మిల్లులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మిల్లర్లు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత వరకు ప్రతి సీజన్‌లో ఎక్కువ మొత్తంలో ధాన్యం రైతుల నుంచి పౌరసరఫరా అధికారులు సేకరిస్తూ రాగా, గత రెండు, మూడు సీజన్ల నుంచి రైతుల నుంచి మిల్లర్లు నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండడంతో జిల్లాలో ప్రభుత్వపరంగా ధాన్యం సేకరణ తగ్గుతూ వస్తోంది. బియ్యం అప్పగించని మిల్లులపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు నిఘా పెట్టడంతో క్రమంగా దారికి వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గడువులోగా ఎంత మేర సీఎంఆర్ రాబట్టుకోగలుగుతారనేది బుధవారం స్పష్టత రానుంది.

మిల్లర్లపై నిఘా

ధాన్యాన్ని పక్కదారి పట్టించి అందినంత సొమ్ము చేసుకుంటున్న మిల్లులపై నిఘా పెట్టింది. ధాన్యం ఉన్నా ఇవ్వని మిల్లర్లను డిఫాల్టర్లుగా గుర్తించి జరిమానా విధించాలని, ధాన్యాన్ని పక్కదారి పట్టించి సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేలా చర్యలకు సిద్ధమవుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ ఇవ్వాలని సూచిస్తూ ఇటీవల రైస్ మిల్లర్లతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సీఎంఆర్ ఇచ్చే విషయంలో నిర్లక్ష్యం తగదని, గడువులోగా ఇవ్వాలని జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ రైస్ మిల్లర్లకు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. జిల్లా అదనపు కలెక్టర్, పౌర సరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైస్ మిల్లులను తనిఖీ చేసిన తరువాతనే సీఎంఆర్ విషయంలో కొంత కదలిక ఏర్పడింది. గడువు లోగా సీఎంఆర్ ఇవ్వని రైస్ మిల్లర్లపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసే విధంగా ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలకు సన్నద్ధమవుతున్నారు.

2022-23లో సీజన్ల వారీగా సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

సీజన్	మిల్లులకు ధాన్యం కేటాయింపు	మిల్లర్లు ఇవ్వాల్సింది	ఇచ్చిన సీఎంఆర్	ఇవ్వాల్సింది	ఇచ్చిన శాతం
ఖరీఫ్ (వానాకాలం)	95095.560	63714.025	40692.661	23021.364	64
రబీ (యాసంగి)	85225.600	57953.408	4698.000	53255.408	9

చెరలో.. దారిపై కదలిక!

స్పందించిన జాతీయ రహదారుల శాఖ, మున్సిపల్ అధికారులు ▸▸ ఘట్‌కేసర్‌లో అక్రమ హోర్డింగ్‌ల తొలగింపు



అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్ పిల్లర్‌ను తొలగిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్, జనవరి 30: 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'చెరలో..దారి' ప్రత్యేక కథనంపై జాతీయ రహదారుల శాఖ, మున్సిపల్ అధికారులు స్పందించారు. జాతీయ రహదారిపై వెహికల్ అండర్‌పాస్ (వీయూపీ) వద్ద రోడ్డు వెడల్పుకోసం 1.14ఎకరాలు స్థలాన్ని సేకరించిన విషయం తెలిసిందే. స్థలం సేకరించి భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించి ఎళ్ళుగడుస్తున్నప్పటికీ అధికారులు ఈస్థలాన్ని స్వాధీనం చేసుకోక పోవడంతో యజమానులే అనుభవిస్తున్నారు. దుకాణసముదాయాలను అద్దెకు ఇస్తూ లబ్ధిపొందుతున్న విషయాన్ని, ఘట్‌కేసర్‌లోని జాతీయ రహదారి స్థలంలో, అటు హెచ్ఎండీఏ సేకరించిన ఔటర్ స్థలాల్లో అక్రమంగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్న విషయాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీంతో అండర్‌పాస్ వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ను జాతీయ రహదారుల శాఖ, మున్సిపల్ అధికారులు తొలగించారు. స్థానిక యంనంపేట్ చౌరస్తా వద్ద హెచ్ఎండీఏ సేకరించిన స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగించేందుకు హెచ్ఎండీఏ అధికారులు శ్రీకారం చుట్టారు. భారీ క్రేన్‌తో వచ్చిన అధికారులు హోర్డింగ్‌లకు కట్టిన ఫ్లెక్సీలను తీసివేశారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటం వలన హోర్డింగ్‌లను తీయడం కష్టంగా మారడంతో తాత్కలికంగా వాయిదా వేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



హోర్డింగ్ బోర్డును కిందికి దించిన సిబ్బంది



మర్రిపల్లిగూడలో అక్రమనిర్మాణాలను కూల్చివేస్తున్న పంచాయతీ సిబ్బంది

సామగ్రిని స్వాధీనం చేసుకోని అధికారులు

ఘట్‌కేసర్‌లోని జాతీయ రహదారి స్థలంతో పాటు పలు చోట్ల అక్రమంగా నిర్మించిన హోర్డింగ్‌లను అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పీఏ బంధువు, ఘట్‌కేసర్ స్థానిక బీఆర్ఎస్ నాయకుడు, స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనుచరుడు పవన్ ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. హోర్డింగ్ సామగ్రిని అధికారులు స్వాధీనం చేసుకోకపోవడానికి పీఏ అండదండలే కారణమని జోరుగా చర్చ జరుగుతున్నది. ఇప్పటికైన ప్రభుత్వ ఘట్‌కేసర్ పట్టణంలో జాతీయ రహదారి, హెచ్ఎండీ, రోడ్లు, భవనాల శాఖల స్థలాల్లో ఎలాంటి అనుమతలు లేకుండానే పెద్దఎత్తున ఏర్పాటు చేసిన హోర్డింగుల నిర్మాణంపై అవినీతి నిరోధకశాఖ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆశాఖ అధికారులు ఇక్కడ జరిగిన అవినీతిపై ఆరా తీసినట్లు సమాచారం. ఆయా శాఖల అధికారులపై ఏ క్షణమైనా ఏసీబీ దాడులు జరుగొచ్చనే చర్చ జరుగుతుంది.

మర్రిపల్లిగూడలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఘట్‌కేసర్ రూరల్ : ఈనెల 25న 'జోరుగా అనుమతి లేని నిర్మాణాలు" అని ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఈక్రమంలో మంగళవారం మర్రిపల్లిగూడలోని ఆక్రమనిర్మాణాలను కూల్చివేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సిబ్బందితో వెళ్లి ఎక్స్‌కవేటర్ సాయంతో మూడు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సునీతారెడ్డి

మహాత్ముడికి నివాళి

వికారాబాద్, జనవరి 30 : మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం వికారాబాద్ జడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్, సీఈవో జానకిరెడ్డి, జడ్పీటీసీ రాందాస్ పాల్గొన్నారు.

మహాత్ములను స్మరించుకోవడం మన బాధ్యత



మౌనం పాటిస్తున్న అధికారులు

కీసర : మహాత్ములను స్మరించుకోవడం మనందరి బాధ్యతని మేడ్చల్ డీఆర్వో హరిప్రియ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ అమర వీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు అమరులకు నివాళులర్పించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే సంకల్పంతో అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

విద్య, వైద్యాభివృద్ధికి చర్యలు


చౌదరిగూడలో పాఠశాల అదనపు గదిని ప్రారంభిస్తున్న జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 30: రాష్ట్రంలో విద్య, వైద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మేడ్చల్ జడ్పీ ఛైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. చౌదరిగూడలో పాఠశాలలో నూతనంగా రూ.10లక్షల జడ్పీనిధులు రెండు లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన అదనపు గదిని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. మేడ్చల్ జిల్లా పరిషత్ నుంచి పాఠశాలల అభివృద్ధికి అత్యధిక నిధులను మంజూరు చేసినట్లు వివరించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ భైరు రమాదేవి రాములుగౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, పంచాయతీ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలి


మాట్లాడుతున్న జిల్లా ఏపీడీ స్టీవెన్‌నీల్

యాలాల, జనవరి 30: పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా ఏపీడీ స్టీవెన్‌నీల్ అన్నారు. మండలంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2022 మార్చి1 నుంచి 2023 మార్చి31 వరకు కొనసాగిన ఉపాధి హామి పనులపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ పనులు సక్రమంగా కొనసాగేలా చూడాలని, లేదంటే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం గ్రామాల వారిగి సామాజిక తనిఖీ కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని అక్కంపల్లి, అన్నసాగర్, ముద్దాయిపేట్, రాస్నం, చెన్నారం, జుంటిపల్లి, బండమీదిపల్లి, కమాల్‌పూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో కొనసాగిన ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ తనిఖీలో ఎలాంటి అవినీతి ఆరోపణలు నెలకొన్నట్లు బయటపడలేదు. రిజిస్ట్రర్‌లో కూలీల హాజరు వేయగా, సంతకాలు చేయలేదని ఆడిటర్లు తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై నెలకొన్న చిన్న చిన్న తప్పులు ఇంకోసారి కొనసాగరాదని ఏపీడీ వారిని మందలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బృందం మానిటర్ హజరత్‌అలీ, డీవీవో భార్గవి, ఎంపీడీవో పుష్పలీల, అంబుడ్స్‌మెన్ రాములు, ఏపీవో జనార్దన్, ఎంపీడీవో యాదయ్య, ఏపీడీ సరళకుమారి, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్


కామేశ్వరి

కులకచర్ల, జనవరి 30: కులకచర్ల శ్రీ రామలింగేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆలూరి కామేశ్వరి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కులకచర్ల మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర డిగ్రీ కళాశాలలో ఆమె ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆలూరి కామేశ్వరికి ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగం నుంచి డాక్టరేట్ లభించింది. హిందీ విభాగ బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ డాక్టర్ సంగీతా వ్యాస్ పర్యవేక్షణలో 'కృష్ణా సోబతి ఔర్ మమతా కాలియా కీ కహానీ యోం మే చిత్రిత్ నారీ జీవన్' అంశంపై పరిశోధన చేసి పంపించగా డాక్టరేట్‌కు ఎంపికై డాక్టరేట్ పొందారు. ఆమె ఉన్నత విద్య డిగ్రీ, పీజీ ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. వీరి తల్లిదండ్రులు ఆలూరి లలితా పరమేశ్వరి భుజంగరావు ప్రముఖ విద్యావేత్త కావడం విశేషం.

పంచాయతీ భవనానికి శంకుస్థాపన

పూడూరు, జనవరి 30: మండల పరిధిలోని మిట్టకంకల్ నూతన పంచాయతీ భవనానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పాల్గొని పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆనందం, మండల అధ్యక్షుడు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం

ధారూరు, జనవరి 30: మండలంలోని మైలారం గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ఎంపీపీ విజయలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. కాగా గ్రామానికి చెందిన నవాబ్ మీర్ సాజిద్ అలీ ఖాన్ పంచాయతీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని విరాళంగా అందజేశారు. ఈస్థలంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీపీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. స్థానిక పాలన ద్వారా ప్రజాసమస్యలు, అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ విజయ్‌కుమార్, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ బాబ్యానాయక్, వాలీబాల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన

దౌల్తాబాద్, జనవరి 30: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మంగళవారం కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కుష్టువ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యసేవలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి సౌమ్య, రామకృష్ణ, తుల్జరాం, సిబ్బంది రఫీ, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మంత్రి పర్యటన రద్దు

▸ నిరుత్సాహంలో కాంగ్రెస్ శ్రేణులు



కందుకూరు, జనవరి 30 : మండలంలోని దెబ్బడగూడలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడానికి మంగళవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు పర్యటన అనివార్య కారణాల శథవల్ల రదద్దయ్యింది. ఆయన పర్యటన సందర్భంగా సర్పంచ్ ఏనుగు శ్రావణి, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఉదయం 10గంటల వరకు పూర్తి ఏర్పాట్లు చేశారు. చివరి నిమిషంలో మంత్రి పర్యటన రద్దు కావడంతో కాంగ్రెస్ నేతలు చేసేదేమీ లేక వెనుదిరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా ఇన్‌చార్జి మంత్రి పర్యటన రద్దు కావడంతో పార్టీ శ్రేణులు నిరుత్సాహం వెలిబుచ్చారు.

సమాచారం ఇవ్వకపోవడం విడ్డూరం

అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడానికి మంత్రి శ్రీధర్‌బాబు వస్తున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. దెబ్బడగూడ గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు మంత్రి వస్తున్నట్లు ఏర్పాట్లు చేసినా తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. కాగా, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిందని, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక సోషల్ మీడియాలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని పోస్టులు పెట్టడం సరైంది కాదన్నారు. సబితారెడ్డి చొరవతో డిగ్రీ కళాశాల, ఇంటర్, లా, మెడికల్ కళాశాలలు మంజూరయిన విషయం కాంగ్రెస్ నేతలకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50రోజుల్లోనే బెదిరింపులకు పాల్పడుతోందని, ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

ఐదు నెలల తర్వాత కౌన్సిల్ సమావేశం

▸ ఎక్స్ -అఫీషియో హోదాలో హాజరు కానున్న ఎమ్మెల్యే

▸ ఎజెండాపై కౌన్సిలర్ల అభ్యంతరం



తాండూరు, జనవరి 30: తాండూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఐదునెలల తర్వాత బుధవారం జరగనుంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పాల్గొనున్నారు. ఎజెండాలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ కార్యాలయాల ఆధునీకరణ మున్సిపల్ ఆవరణలో టైల్స్ ఫ్లోరింగ్ గ్రీనరీ, బల్దియా చుట్టూ అభివృద్ధి పనులు తుదితరానికి సంబంధించి రూ.కోటి కేటాయింపుపై మెజార్టీ కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతున్నారు. గతేడాది జనవరి 25న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి సుమారు రూ.14కోట్ల నిధులను వార్డుకు రూ.50లక్షలు కేటాయిస్తూ ఎజెండా నంబర్ 41లో పొందుపరిచారు. ఈ నిధులు మాకొద్దంటూ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గానికి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లతో పాటు బీజేపీ, టీజేఎస్ ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు రాత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. దీంతో నిధుల కేటాయింపు నిలిచిపోయింది. ఈసారి ఎజెండాలో ఈనిధుల కేటాయింపు అంశాన్ని చర్చించలేదు.



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

కడ్తాల్, జనవరి 30: సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. కేటీఆర్ వైఖరిని నిరసిస్తూ కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక పాలశీతలీకరణ కేంద్రం ఎదుట హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిర్వహించిన కార్యక్రమంలో కడ్తాల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ కడ్తాల పట్టణాధ్యక్షుడు రాంచందర్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, జిల్లా గిరిజన సేవా సమితి అధ్యక్షుడు హన్మనాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు గూడూరు భాస్కర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మండల కో-ఆప్షన్‌సభ్యుడు జహంగీర్ బాబాలు హాజరయ్యారు. జాతీయ రహదారిపై కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేటీఆర్ ఇకనైనా తన వైఖరి మార్చుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోరని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి పరాకాష్ఠ అని మండిపడ్డారు. అధికారం కోల్పోయిందన్న అక్కసుతో బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించినట్లు ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ సమాజానికి కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్‌చేశారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ భూస్థాపితం కాకతప్పదని డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు హన్మనాయక్, వెంకటేశ్, భాస్కర్‌రెడ్డిలు హెచ్చరించారు. మండల సేవాదల్ అధ్యక్షుడు గురిగళ్ల లక్ష్మయ్య, జిల్లా, మండల నాయకులు సత్యం యాదవ్, జహంగీర్‌అలీ, యాదయ్యగౌడ్, మల్లయ్య, రామకృష్ణ, శ్రీను, సజ్జన్‌లాల్, అశోక్, క్యామ రాజేశ్, ఇమ్రాన్‌బాబా, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు జాతీయ సమైక్యతను పెంపొందిస్తాయి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 30: క్రీడలు జాతీయ సమైక్యతను పెంపెందిస్తాయని మేడ్చల్ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. అంకుషాపూర్ ప్రిన్సిటన్ కళాశాల ప్రాంగణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల బుద్వేల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 7వ రాష్ట్రస్థాయి క్రీడలు ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలల నుంచి 900 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీచైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడావిభాగంలో ప్రభుత్వఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలి: ఎమ్మెల్యే

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటి ముందుకుసాగాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. క్రీడలు ఏకాగ్రతను పెంచుతాయని తెలిపారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటి ముందుకుసాగాలన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ సంయుక్త కార్యదర్శి నిరుప, ప్రాంతీయ కో-ఆర్డినేటర్ నాగకళ్యాణి, స్పోర్ట్స్ అఫీసర్ రామ్‌లక్ష్మన్, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్, ఎంపీటీసీ శోబారాణి, ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు, నిరుపమా, అధ్యాపకులు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

సుగుణ స్టీల్ కంపెనీపై విచారణ

పరిగి, జనవరి 30: మండలంలోని లక్ష్మీదేవిపల్లి శివారులో ఉన్న సుగుణ స్టీల్ కంపెనీలో మంగళవారం వికారాబాద్ ఆర్డీవో ఎ.విజయకుమారి విచారణ జరిపించారు. ఈ ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యంతో పంటలకు నష్టం వాటిల్లుతోందని డి.ఆంజనేయులు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతోపాటు ఇటీవల రైతులు కంపెనీ కాలుష్యంతో పంటలతోపాటు, పొగతో పరిసర గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని కంపెనీ ఎదుట ఆందోళనలు చేపట్టారు. దీనిపై వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి, జిల్లా వ్యసాయాధికారి గోపాల్‌తోపాటు, ఏవో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల బృందం కంపెనీ పరిసరాలను పరిశీలించారు. కాలుష్యంతో పంటలకు నష్టం వాటిల్లుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అదేవిధంగా పరిసరాల్లో భూముల రైతులతో మాట్లాడారు. కంపెనీకి వర్తించే వివిధ శాఖల నుంచి వేర్వేరుగా నివేదికలను తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. అన్నిశాఖల నివేదికల సమాచారాన్ని సేకరించి తుది నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు. అనంతరం కంపెనీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, తహశీల్దార్ ఆనంద్‌రావు, ఏవో ప్రభాకర్‌రెడ్డి, పీవోబీ అధికారులు, నారాయణపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

తాండూరు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం రద్దు

▸ హైకోర్టును ఆశ్రయించిన చైర్‌పర్సన్

తాండూరు, జనవరి 30: తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది సెప్టెంబరు 12న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వీణా బాధ్యతలు చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఐదు నెలల కాలంలోనే పాలకవర్గం పదవులను కోల్పోవాల్సివచ్చింది. జిల్లా వ్యాప్తంగా 10వ్యవసాయ మార్కెట్లు ఉండగా కొన్ని మార్కెట్లకు పాలకవర్గం పదవీకాలం పూర్తి కాగా మరికొన్ని పాలకవర్గాన్ని రద్దు చేయకుండా కొనసాగిస్తున్నారు. తాండూరు నియోజకవర్గంలో తాండూరు, కోట్‌పల్లి, బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్లు ఉండగా కోట్‌పల్లి, బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు శాసనసభ ఎన్నికల ముందుగానే కాంగ్రెస్‌లో చేరడంతో వారి పదవులు యథావిధిగా కొనసాగిస్తున్నారు. తాండూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ పాలకవర్గం బీఆర్ఎస్‌లోనే కొనసాగడంతో ఒక్క తాండూరు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాన్ని రద్దు చేశారు. ఈ విషయమై చైర్‌పర్సన్ వీణా హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయకుండా తొలగింపుపై హైకోర్టును ఆశ్రయించారు. 2017-18 సంవత్సరంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా ఉన్న ఎం.సురేష్ (కాంగ్రెస్) కొనసాగారు. బీఆర్ఎస్ అధికారంలో రాగానే అప్పటి పాలకవర్గాన్ని రద్దుచేయగా హైకోర్టు స్టే ఇచ్చింది. హైకోర్టు స్టేతో కొన్నినెలలు కొనసాగిన తర్వాత అప్పటి ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చి పాలకవర్గం రద్దు చేసింది. ప్రస్తుతం చైర్‌పర్సన్ హైకోర్టును ఆశ్రయించిన తర్వాత కోర్టు కేసును రిజర్వు చేసినట్లు సమాచారం.

పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

ధారూరు, జనవరి 30: మండలంలోని 32 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీపీ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. సర్పంచుల పదవీకాలం ముగిసిపోవటంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించిందని ఆమె చెప్పారు. అల్లాపూర్ పంచాయతీకి ఏఈవో కె.త్రైలోక్య, అల్లీపూర్‌కు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత పవార్, ఎస్ఏ జడ్పీహెచ్ఎస్ అంపల్లికి యాదయ్య, అంతారంకు ఎపీవో ఈజీఎస్ సురేష్, చింతకుంటకు ఎంపీవో షఫీ ఉల్లా, ధర్మాపూర్‌కు జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ గుణవంత్‌రెడ్డిని నియమించారు. అదేవిధంగా ధారూరుకు తహసీల్దార్ సీ.భువనేశ్వర్, ధారూరు స్టేషన్‌కు ఎంపీడీవో చెన్నారెడ్డి, దోర్నాల్‌కు జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ భాస్కర్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఎబ్బనూర్‌కు ఏఈవో సుజాత, గడ్డమీది గంగారంకు సర్వేయర్ రమేశ్, గట్టేపల్లికి ఆర్ఐ నవీన, గురుదోట్లకు ఏఈవో సంతోష్‌కుమార్, హరిదాసుపల్లికి ఏవో ఝాన్సీ, కేరెల్లికి జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ రాంచంద్రయ్య, కొండాపూర్ కలాన్‌కు సీనియర్ అసిస్టెంట్ శివానంద్‌లను నియమించారు. అదేవిధంగా కుమ్మర్‌పల్లికి ఏపీఎం శ్రీనివాస్, కుక్కిందకు ఏఈవో మంజుల, మైలారంకు ఆర్ఐ వీరేశం, మోమిన్‌కలాన్‌కు ఏఈవో మల్లేశం, మోమిన్‌కుర్థుకు డీటీ వి.విజయ్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. అదేవిధంగా మున్నూరు సోమారం గ్రామానికి ఈసీ రమేశ్, నాగరం గ్రామానికి హెచ్ఎం నరేందర్‌రెడ్డి, నాగసమందర్‌కు జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ ఉదయ్‌కుమార్, నాగ్‌సాన్‌పల్లికి ఏఈవో హరిప్రసాద్, నర్సాపూర్‌కు ఏఈ ట్రాన్స్‌కో వేణుగోపాల్ రెడ్డి, అవుసుపల్లికి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పీసీఎం తండాకు సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, రాజాపూర్‌కు జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ మల్లేశం, రాంపూర్‌కు ఏఈవో సంజూరాథోడ్, రుద్రారంకు సీనియర్ అసిస్టెంట్ ఆనంద్‌కుమార్, తరిగోపులకు జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ శివ కుమార్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు ఎంపీపీ వివరించారు.

ఆదిభట్ల కౌన్సిలర్ నిరంజన్‌రెడ్డికి షోకాజ్ నోటీస్



ఆదిభట్ల, జనవరి 30 : కాంగ్రెస్‌కు చెందిన ఆదిభట్ల మున్సిపల్ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డికి పార్టీ షోకాజ్ నోటీస్ జారీ చేసింది. మున్సిపాలిటీలో సొంత పార్టీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోసం కౌన్సిలర్లతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు క్రమశిక్షణ సంఘం చైర్మన్ జి.చిన్నారెడ్డి మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. చైర్‌పర్సన్‌పై ఫిర్యాదు చేయడమే కాకుండా బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన కౌన్సిలర్లతో క్యాంపు నడుపుతున్న నేపథ్యంలో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చిన్నారెడ్డి పేర్కొన్నారు. కాగా, క్యాంపులో ఉన్న మిగతా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు సైతం త్వరలో షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది.



షాద్‌నగర్ రూరల్ : ర్యాలీ ప్రారంభిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్

ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవాలి

షాద్‌నగర్ రూరల్/శంషాబాద్, జనవరి 30 : ప్రతీ వాహనదారుడు రోడ్డు నియమ నిబంధనలు తెలుసుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని పోచమ్మ గుడి నుంచి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు తెలియకంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అతివేగం ప్రమాదాలకు కారణమవుతోందని తెలిపారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితిలో వాహనం నడుపవద్దన్నారు. 18 ఏళ్లు నిండినవారు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం, ట్రాఫిక్ ఎస్సై రవీందర్ నాయక్, ఆర్టీవో బాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు పోలీస్‌స్టేషన్ నుంచి మహవీర్ బిల్డర్స్, కోత్వాల్‌గూడ చౌరస్తా, ఆర్బీనగర్, మధురానగర్, సామా ఎన్‌క్లేవ్, బస్టాండు చౌరస్తా, ఎయిర్‌పోర్టు చౌరస్తా, రాళ్లగూడ రోడ్డులో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. సీఐ రాజు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రజలు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలు నివారణకు సహకరించాలన్నారు.

నేర పరిశోధనకు సీసీ కెమెరాలు దోహదం



కెమెరాలను ప్రారంభిస్తున్న గోలిశ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 30: నేర పరిశోధన, చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నారాయణ పూర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను మంగళవారం సీఐ సోమ నర్సయ్య, సర్పంచ్ అంజినాయక్‌లతో కలిసి గోలి ప్రారంభించారు. సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, కార్యదర్శి, వార్డు సభ్యులు, నాయకులు రమేశ్, సుభాష్, సతీష్, సుమన్ నాయక్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి

ఆదిభట్ల, జనవరి 30 : కంప్యూటర్ పరిజ్ఞానం మనిషి జీవితంలో తప్పనిసరి అవసరంగా మారిపోయిందని, దానిపై ప్రతీ ఒక్కరికి అవగాహన, పరిజ్ఞానం ఉండాలని ఇబ్రహీంపట్నం ఎంఈవో వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 60మంది ఉపాధ్యాయులకు మంగళవారం కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈవో మాట్లాడుతూ దైనందన జీవితంలో కంప్యూటర్ పరిజ్ఞానం అంతర్భాగమైందని, ప్రతీ వ్యక్తికి కంప్యూటర్‌పై పరిజ్ఞానం ఉండాల్సిందేనన్నారు. సీవీఆర్ విద్యాసంస్థలు రెండేళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వడమే కాకుండా కంప్యూటర్లను అందజేయడం ప్రశంసనీయమన్నారు. సీవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, హెచ్‌వోడీ లక్ష్మిలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు కంప్యూటర్ టెక్నాలజీ నేర్చుకోవడం నైపుణ్యత, విశ్వాసం మరింతగా పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటివరకు 35 కంప్యూటర్లు అందించినట్లు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నం, పీఆర్టీయూ నాయకులు గోవర్ధన్, పరమేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



కంప్యూటర్ శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

మహాత్ముడి ఆశయాలను సాధిద్దాం


తాండూరు: గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జనవరి 30: మహాత్మాగాంధీ ఆశయాలను సాధిద్దామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గాంధీజీ 76వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం గాంధీచౌక్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నీరజాబాల్‌రెడ్డి, మధుబాల, సోమశేఖర్, మాజీ కౌన్సిలర్ నర్సింలు, లింగదళ్లి రవికుమార్ పాల్గొన్నారు. ఆర్యవైశ్య కళ్యాణ మంటపంలో గాంధీజీ విగ్రహానికి మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పరిగి: గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని డీసీసీ కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణలు పరిగిలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నసీరుద్దీన్, డి.అశోక్, నాగవర్దన్, శివకుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కులకచర్ల: చౌడాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా కులకచర్ల పంచాయతీలో సర్పంచ్, గ్రామస్తులు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంగారెడ్డి, చౌడాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్చాటి అశోక్‌కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, యువజన సంఘాల నాయకులు వెంకటేశ్, చిన్నయ్య, రమేశ్, గోపాల్, నర్సింహులు, పాండు, గౌరిశంకర్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, రేయ్యపల్లి మల్లేష్ గౌడ్, మల్లేష్ గౌడ్, సత్యనారాయణ, లక్ష్మణ్, దాత్రిక లింగం, రవి ముదిరాజ్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ ఎండీ సాబేర్ అలీ, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

ఘట్‌కేసర్ రూరల్: గాంధీజీ వర్ధంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా అవుషాపూర్ పంచాయతీ ఆవరణలోని గాంధీ విగ్రహానికి ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కావేరిమచ్చేందర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ గోవర్దనగిరి, మర్రిపల్లిగూడ ఉపసర్పంచ్ మాయ నరేష్, నాయకులు కుమార్, మచ్చేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నిఖిల్, బసవ రాజుగౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహానికి తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, శశి, అనురాధ, శ్రీప్రియ, టీవీవీ నాయకులు రవీందర్‌గౌడ్, లక్ష్మీ, విజయలక్ష్మి, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, సోమ్లనా, గౌస్, ఖలీల్, కాశీపతి తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

మోమిన్‌పేట్: అహింస మూర్తి గాంధీజీ వర్ధంతి సందర్భంగా వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నివాళులర్పించారు. మండలంలోని కొత్త కొల్కుంద, పాత కొల్కుంద గ్రామాల్లో మంగళవారం జాతిపిత గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమస్యల పరిష్కారంతోనే ప్రజల్లో ఆదరణ

మేడ్చల్ టౌన్, జనవరి 30: నిత్యం ప్రజల కోసం పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తపించే నేతలను ప్రజలు ఎల్లప్పుడూ ఆదరిస్తారని మేడ్చల్ మండల ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ కాలం పూర్తిచేసుకున్న మండలంలోని సర్పంచ్‌లకు సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో పలు అంశాలపై సాదాసీదాగా చర్చించారు. ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ హనుమాన్ గౌడ్‌లు ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, ఎంపీడీవో పద్మశ్రీ, తహసీల్దార్ శైలజ, గ్రామాల ఎంపీటీసీలు, కార్యదర్శులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి పాలకవర్గానికి సన్మానం

పరిగి: రంగాపూర్ గ్రామ పంచాయితీ పాలకవర్గానికి మంగళవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ అరవింద్‌రావు, ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో దయానంద్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ లక్ష్మీబాయి, కార్యదర్శి విశ్వతేజలు పాలకవర్గానికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

గౌతాపూర్‌లో పాలకవర్గానికి సన్మానం

తాండూరురూరల్: తాండూరు మండలం గౌతాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో పాలకవర్గం పదవీకాలం ముగింపు సందర్భంగా మంగళవారం వీడ్కోలు పౌరసన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గౌతాపూర్ సర్పంచ్ రాజప్పగౌడ్ మాట్లాడుతూ ఐదేళ్లలో అభివృద్ధి పనులకు రూ.18కోట్ల 14లక్షల 70వేల 678 ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. డీఎల్‌పీవో శంకర్‌నాయక్ మాట్లాడుతూ గౌతాపూర్ గ్రామపంచాయతీని సర్పంచ్ రాజప్పగౌడ్ అన్ని విధాల అభివృద్ధి చేశారని ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గౌడి మంజుల వెంకటేశం, వైస్ ఎంపీపీ స్వరూపా వెంకట్‌రాంరెడ్డి, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, గౌతాపూర్ ఎంపీటీసీ రాజమణి ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, రతన్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు రాంచందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, శంషొద్దీన్, వీరేందర్‌రెడ్డి, సంగప్ప, షబ్బీర్‌అలీ, మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుజాత, నాగప్ప, హెచ్ఎం సుధారాణి పాల్గొన్నారు.

సర్పంచ్‌గా పని చేయడం అదృష్టం

మోమిన్‌పేట్: ఐదు సంవత్సరాల పాటు మోమిన్‌పేట్ సర్పంచ్‌గా పని చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు సర్పంచ్ అంగెరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.


తాండూరు రూరల్: గౌతాపూర్‌లో సన్మానం పొందిన గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రతినిధులు

సర్పంచ్‌ల పదవీ కాలం ఈనెల 30తో ముగియనుండటంతో మంగళవారం మండలంలోని ఏజేఆర్ ఫంక్షన్ హాలులో సర్పంచ్, పాలక వర్గ సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బి.విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంగెరి శ్రీనివాస్‌రెడ్డి, పాలక వర్గ సభ్యులను గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, యువకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సర్పంచ్‌ను 62కిలోల బెల్లంతో పాలకవర్గ సభ్యులు, యువకులు అధికారులతో కలిసి తులభారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారెడ్డి, ఎంపీవో యాదగిరి, సీనియర్ అసిస్టెంట్ బక్కప్ప, ఏఈవో పెంటయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్, మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు నర్సింహులులు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సర్పంచ్‌ల కృషి అభినందనీయం

కొడంగల్ రూరల్: గ్రామ అభివృద్ధికి సర్పంచ్ భైరం గుండప్ప చేసిన కృషి అభినందనీయమని గ్రామస్తులు అన్నారు. మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామ పంచాయతీ పాలక వర్గసభ్యుల పదవీ కాలం బుధవారంతో ముగియనుండటంతో మంగళవారం గ్రామస్తులు సర్పంచ్, పాలకవర్గ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి: ఎమ్మెల్సీ

బషీరాబాద్: తాండూరులో పార్టీలకతీతంగా కలిసి పనిచేస్తామని ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడి అన్నారు. కొర్విచెడ్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మండల స్థాయి సర్పంచుల వీడ్కోలు సన్మాన సభను ఏర్పాటు చేయగా ఎమ్మెల్సీ మట్లాడారు. తను మంత్రిగా ఉన్నప్పుడూ ఈ ప్రాంతానికి కోట్లాది రూపాయలు కేటాయించి అభివృద్ధి పరిచినట్లు గుర్తుచేశారు. స్థానిక సర్పంచ్ శోభారాణి కొర్విచెడ్ పంచాయతీలో పలు సమస్యలపై సభలో విన్నవించగా ఎమ్మెల్యే రూ.20లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఎమెల్సీ, ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కలను లబ్దిదారులకు పంపిణీ చేశారుఈ సందర్భంగా జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ శోభారాణి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు గజమాలతో సన్మానించారు. అనంతరం సభలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీపీ, జడ్పీటీసీ సర్పంచులకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, శాంతాబాయి, ఎస్.వెంకటేష్, కలాల్ నర్సింహులుగౌడ్, లక్ష్మణ్‌రావు, రామునాయక్, శంకరప్ప, శ్రావణ్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.


సన్మాన సభలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను గజమాలతో సన్మానిస్తున్న జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి దంపతులు

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటా


మాట్లాడుతున్న మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట, జనవరి 30: ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కార్యకర్తలకు మనోధైర్యం కల్పించారు. శామీర్‌పేట్ మండలంలోని అలియాబాద్ క్రాస్‌రోడ్డులోని సీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం మాజీ మంత్రి జగదీష్‌రెడ్డితో కలిసి విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. మేడ్చల్ నియోజకవర్గంలోనూ ప్రతి గ్రామంలోనూ, మున్సిపాలిటీల్లోనూ పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసామన్నారు. జవహర్‌నగర్‌లోనే 40వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగేహక్కు మనకే ఉందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటానని హామీ ఇచ్చారు. పదవీ కాలం ముగియనుండటంతో వివిధ గ్రామాల సర్పంచులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఎల్లుబాయి, హారికమురళిగౌడ్, జడ్పీటీసీ అనిత లాలయ్య, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సుదర్శన్, మల్లేష్‌గౌడ్, పార్టీ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడి మృతి

వికారాబాద్, జనవరి 30 : తెలంగాణ ఉద్యమకారుడు, గోధుమగూడ గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణగౌడ్ ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన మృతి బాధాకరమని బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద్ పటేల్ అన్నారు. లక్ష్మీనారాయణగౌడ్ నివాసానికి మంగళవారం జడ్పీ వైస్‌చైర్మన్ విజయ్ కుమార్‌తో కలిసి వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఈ ప్రాంతంలో లక్ష్మీనారాయణ గౌడ్ ప్రముఖుడని ఎన్నో దఫాలు పోలీస్ కేసులు నమోదై జైలుకు సైతం వెళ్లి వచ్చారని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారితో పటు నాయకులు భూమోళ్ల కృష్ణ, దత్తు, నర్సింహులు, శివకుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రుకుంపల్లి, జాఫర్‌పల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రికొత్తగా నిర్మించిన పంచాయతీ భవనాలను, పొల్కంపల్లిలో బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక సదుయాపాల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్ని గ్రామాల శాశ్వత అభివృద్ధి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో దయానంద్, సర్పచులు శ్రీనివాస్,అనిత, పార్టీ మండల అధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలి

కులకచర్ల: విద్యార్థులు శ్రద్ధతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్‌లో మంగళవారం ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల విద్యార్థులకు రాకంచెర్ల సర్పంచ్ పెంటయ్య ఆధ్వర్యంలో 'మేము సైతం' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఒత్తిడికి గురి చేయరాదన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీఆనంద్, పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, కులకచర్ల ఎంపీటీసీ ఆనంద్, పార్టీ నాయకులు మొగులయ్య, ఉప సర్పంచ్ చంద్రభూపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పౌర హక్కులపై అవగాహన ఉండాలి

యాలాల, జనవరి 30: ప్రతీఒక్కరు పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని యాలాల ఎస్‌ఐ శంకర్ అన్నారు. మండలంలోని అచ్యుతాపూర్ గ్రామంలో మంగళవారం పోలీస్, రెవెన్యూ అధికారులు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ నారాయణరెడ్డి, యాలాల ఎస్సీ హాస్టల్ వార్డెన్ వీరానందం, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూడూరు: అంగడిచిట్టంపల్లిలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవంపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెన్‌గోముల్ ఎస్‌ఐ గిరి, రెవెన్యూ అధికారులు పాల్గొని గ్రామస్తులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు.

కులకచర్ల: చౌడాపూర్ పంచాయతీలో మంగళవారం సర్పంచ్ కొత్త రంగారెడ్డి ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతీఒక్కరి బాధ్యత అని చౌడాపూర్ తహసీల్దార్ ప్రభు, కులకచర్ల ఎస్‌ఐ శ్రీశైలం తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజీరెడ్డి, రెవెన్యూ అధికారి లింగప్ప, మరికల్ వార్డెన్ వెంకటయ్య, యాదిబాయి, కల్పన, యాదమ్మ, జంగమ్మ పాల్గొన్నారు.


పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మర్పల్లి: పౌరుల హక్కుల పట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బిల్కల్ గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

తాండూరురూరల్: పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అల్లాపూర్ గ్రామంలో మంగళవారం పౌరహక్కుల అధికారి గోవింద్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి, పౌరహక్కుల అధికారి గోవింద్ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసమే చట్టాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందిని, యాదయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శి భవాని, రెవెన్యూ అధికారి జూనియర్ అసిస్టెంట్ బాబు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కొడంగల్: మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం సర్పంచ్ టి.అనిత ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పాండు, ఎంపీవో శ్రీనివాస్, ఏఎస్‌ఐ బాలకిషన్, రెవెన్యూయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **వికారాబాద్:** వికారాబాద్ టౌన్ సీఐ టి.శీను మంగళవారం సిబ్బందితో కలిసి పాన్ షాపులు, దుకాణాలతో ఆకస్మికంగా తనిఖీ చేశారు.
- **పెద్దేముల్:** తాండూరు రూరల్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అశోక్‌కుమార్‌ను పెద్దేముల్ మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం సన్మానించారు.తాండూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐని కలిసిన నారాయణరెడ్డి, జితేందర్‌రెడ్డి, విద్యాసాగర్, మహిపాల్ రెడ్డి, కోహీర్ రవిశంకర్ తదితరులు ఉన్నారు.
- **బషీరాబాద్:** మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు వివిధ పార్టీల మండల నాయకులు మంగళవారం తీర్మానించారు. ఈ క్రమంలో స్థానిక సర్పంచ్ పూడూరు ప్రియాంకకు స్థలం కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.
- **మేడ్చల్ టౌన్:** ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని బంగారు పతకాలను కైవసం చేసుకున్న మేడ్చల్ పట్టణ అత్వెల్లి జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు వచ్చేనెల కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే ఇండో నేపాల్ పోటీలకు ఎంపిక చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.
- **ధారూరు:** మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేసిన ట్రైనీ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ మాలెంపాటిని మంగళవారం సాయంత్రం మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో చెన్నారెడ్డి, తహసీల్దార్ భువనేశ్వర్ పాల్గొన్నారు.
- **పరిగి:** పదోతరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా పనిచేయాలని పరిగి ఎంఈవో హరిశ్చందర్ సూచించారు. మంగళవారం పరిగిలో హెచ్ఎంలతో సమీక్ష నిర్వహించారు.
- **తాండూరు:** తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న నియంతలా వ్యవహరిస్తూ ఎజెండా తయారు చేశారని సొంత పార్టీ బిఆర్ఎస్‌కు చెందిన వైస్ చైర్‌పర్సన్ దీపా నర్సింహులు, ఫ్లోర్ లీడర్ శోభారాణి, కౌన్సిలర్లు వరాల శ్రీనివాస్‌రెడ్డి, అసిఫ్ మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోపించారు.
- **మూడుచింతలపల్లి:** టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామానికి రూ. 10 లక్షల చొప్పున అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని మూడుచింతలపల్లి మండల అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు.
- **తాండూరురూరల్:** ఉద్దండాపూర్‌లో గ్రామదేవత ఊరడమ్మ జాతర మంగళవారం కొనసాగింది.
- **యాలాల:** అగ్గనూర్ జడ్‌పిహెచ్ఎస్ పాఠశాల ముందు బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని సోమవారం సాయంత్రం పాఠశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు.
- **కొడంగల్:** పోలింగ్ ప్రక్రియ, ఈవీఎం యంత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పరిశీలించారు.
- **మూడుచింతలపల్లి:** వరి సాగులో మెళకువల పై రైతులకు మంగళవారం రైతువేదికలో వ్యవసాయ అధికారి క్రిష్ణవేణి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి, ఎంపీటీసీ నాగరాజు, ఏఈవో రవియాదవ్, రైతులు పాల్గొన్నారు.
- **పరిగి:** ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రతినిధిగా నియమితులైన మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవిని మంగళవారం పరిగికి చెందిన ఉపాధిహామి పథకం రాష్ట్ర మాజీ డైరెక్టర్ కంకల్ వెంకటేశం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మల్లు రవిని కలిసినవారిలో ఎం.విజయ్‌కుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.
- **పరిగి:** జంతువులను సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్ అన్నారు. జంతుసంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం పరిగిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు అంకంరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు..
- **కీసర రూరల్:** ఫిబ్రవరి 9న నాగారం మున్సిపాలిటీ తై బజార్ వేలం నిర్వహించనున్నట్లు నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. వేలం పాటలో పాల్గొనాలనుకున్న వారు నాగారం మున్సిపల్ కమిషనర్ పేర రెండు లక్షల రూపాయల డీడీని దరఖాస్తుతో పాటు ఫిబ్రవరి 8 సాయంత్రంలోగా మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని ఈ సందర్భంగా సూచించారు.

క్రైం కార్నర్

అక్రమ కలప, ఎర్రమట్టి వాహనాల పట్టివేత

మర్పల్లి, జనవరి 30: అనుమతులు లేకుండా అక్రమంగా కలప, ఎర్రమట్టిని తరలిస్తున్న బొలెరో, టిప్పర్ వాహనాలను పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు మర్పల్లి ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కలప, ఎర్రమట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం పక్కాసమాచారంతో దాడులు నిర్వహించారు. వాహనాలను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అక్రమ కలప, ఎర్రమట్టి తరలిస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన రౌడీషీటర్‌పై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 30: ఘట్‌కేసర్ మైసమ్మగుట్ట జాతరలో దేవాదాయశాఖ అధికారిని ఎల్.భాగ్యలక్ష్మి విధులకు ఆటంకం కలిగించిన రౌడీషీటర్‌పై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఎ.శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 28వ తేదీన ఘట్‌కేసర్ మైసమ్మగుట్ట జాతర సందర్భంగా ఆలయానికి చందాలు ఇచ్చిన భక్తుల పేర్లు మైక్‌లో చదుతుండగా రౌడీషీటర్ రాజబోయిన యాదగిరి యాదవ్ దేవాదాయశాఖలో అధ్వర్యంలో జాతర నిర్వహిస్తున్నపడు భక్తుల నుంచి చందాలు ఎందుకు వసూలు చేస్తున్నావని ఈవోను ప్రశ్నించాడు. నిబంధనల ప్రకారమే చందాలు అడిగానని ఈవో బదులు ఇవ్వడంతో యాదగిరి యాదవ్ ఆమెను అసభ్యపదజాలంతో దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు. ఈవో భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాదగిరి యాదవ్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాన్ షాపుల్లో హుక్కా దందా

తాండూరు, జనవరి 30: ఇందిరాచౌక్‌లో సోమవారం రాత్రి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పాన్‌షాపులను తనిఖీ చేశారు. కొంతమంది షాపు యజమానులు నిబంధనలకు విరుద్ధంగా హుక్కా దందా నిర్వహిస్తున్నట్లు గుర్తించి హుక్కా సామగ్రితో పాటు ఫ్లేవర్లు గంజాయి సేవించే ట్రిప్‌లను సీజ్ చేశారు. హుక్కా వ్యాపారం నిర్వహిస్తున్న పాన్‌షాపు యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ కేసును టాస్క్‌ఫోర్స్ తాండూరు పోలీసులు కలిసి సంయుక్తంగా విచారణ జరిపారు.

నంబర్ ప్లేట్లు మార్చిన బైక్‌లు సీజ్

మేడ్చల్ టౌన్, జనవరి 30: నంబరు ప్లేట్లపై నెంబర్లు మార్చి నడుపుతున్న ఆరు బైకలను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై టాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, సీఐ హనుమాన్ గౌడ్‌లు మంగళవారం తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్‌పై స్టిక్కర్లు అతికించిన ఆరు బైక్‌లను గుర్తించి వాటిని సీజ్ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు


పరిగి మార్కెట్ యార్డును సందర్శిస్తున్న మార్కెటింగ్ శాఖ రాష్ట్ర సంచాలకులు లక్ష్మీబాయి

పరిగి, జనవరి 30: మార్కెట్‌లో పంటల క్రయ విక్రయాల్లో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర సంచాలకురాలు లక్ష్మీబాయి స్పష్టం చేశారు. పరిగి మార్కెట్ యార్డును మంగళవారం సాయంత్రం సందర్శించారు. అనంతరం వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులను ఎవరు నష్టపరిచినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇక నుంచి పరిగి మార్కెట్ యార్డులో ప్రతీ శుక్ర, మంగళవారాల్లో క్రయవిక్రయాలు జరుగుతాయని నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు పండించిన ఏ పంటకైనా గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. ఈ-నామ్‌పై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. మార్కెట్‌లో ఈ-నామ్ కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి వారం ఉదయం, మధ్యాహ్నం టెండర్లు నిర్వహించాలని సూచించారు. పంటల వారీగా ధరల వివరాలను నోటీసు బోర్డుపై డిస్‌ప్లే చేయాలని సూచించారు. వేబ్రిడ్జిని వినియోగించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే తక్కువగా కొంటే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ పద్మహర్ష, రంగారెడ్డి డీఎంవో ఛాయదేవి, జిల్లా మార్కెటింట్ అధికారి సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

సీఐ గోవర్దనగిరికి సన్మానం


సీఐ గోవర్దనగిరిని శాలువాతో సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 30 : నూతనంగా ఉద్యోగ బాధ్యతుల చేపట్టిన ఘట్‌కేసర్ సీఐ గోవర్దనగిరిని మంగళవారం బీఆర్ఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. పోలీసుస్టేషన్‌లో సీఐని కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్ రమేష్, ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, అవుశాపూర్ ఉపసర్పంచ్ ఎల్సాని అయి లయ్యాయాదవ్, నాయకులు బిక్షపతిగౌడ్, బొడిగే శ్రీనివాస్‌గౌడ్, వీరేష్, కొట్టి శ్రీకాంత్‌రెడ్డి, కందకట్ల దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి


జెట్టి మెషిన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్, జనవరి 30: నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తెలిపారు. మున్సిపల్ నిధులు రూ.39.89లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన జెట్టింగ్(మ్యాన్ హోల్ క్లీనింగ్) మెషిన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. మ్యాన్ హోల్ జామింగ్‌ను తొలగించేందుకు 9640010053 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, డీఈఈ రఘు, మేనేజర్ చంద్రశేఖర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు ఇంటి స్థలాల పరిశీలన

మర్పల్లి, జనవరి 30: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా అమరవీరుల కుటుంబాలకు 250గజాల ఇంటి స్థలం కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మర్పల్లి మండలంలోని సిరిపూరం గ్రామానికి చెందిన భరత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ ఇద్దరు మృతిచెందగా ఘనపూరం గ్రామానికి చెందిన ఏసేబు అనే ముగ్గురు తెలంగాణ రాష్ట్రం రాదేమోనని ఆత్మహత్య చేసుకున్నారు. గత ప్రభుత్వం ఆ కుటుంబాలను అమరవీరులుగా గుర్తించి కుటుంబంలో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కేటాయించి రూ.10లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల్లో భాగంగా ఆ మూడు కుటుంబాలకు 250గజాల ఇంటి స్థలాన్ని కేటాయించేందుకు పరిశీలించినట్లు తహసీల్దార్ గణేశ్ తెలిపారు.

ఆర్టీసీ కార్మికులకు ప్రగతి చక్రం పురస్కారం

మేడ్చల్ టౌన్, జనవరి 30: విధినిర్వాహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన మేడ్చల్ ఆర్టీసీ డిపో డ్రైవర్, కండక్టర్లకు మంగళవారం ప్రగతి చక్రం పురస్కారంతో సన్మానించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సుధాకర్ డిపో కార్మికులకు శాలువా కప్పి సన్మానించి, గుర్తింపు పత్రాన్ని అందజేశారు.